www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025
5
తిరుపతి



వృద్ధాప్యంతో తెల్ల పెద్దపులి మృతి



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కులో తెల్ల పెద్దపులి ' సమీర్ ' వృద్ధాప్యంతో వచ్చే అనారోగ్య కారణాలతో మరణించినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. 2011లో ఐదు సంవత్సరాల వయసులో హైదరాబాదులోని నెహ్రూ జూలాజికల్ పార్క్ నుండి తిరుపతి జూలాజికల్ పార్కుకు తరలించారని, గడిచిన 14 ఏళ్లుగా జూ పార్కులో సందర్శకులను ఆకట్టుకుందన్నారు. ఏడాదిగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమీర్‌ను సందర్శనకు ఉంచకుండా చర్యలు తీసుకున్నామని, కొద్ది రోజులుగా ద్రవ ఆహారం తీసుకుంటోందని, గత వారం రోజులగా అదీకూడా తీసుకోలేక ఆదివారం తెల్లవారు జామున మృతి చెందిందన్నారు. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, పాథాలజీ విభాగం వైద్యుల బృందం నిర్వహించిన పోస్ట్–మార్టమ్ పరీక్షలో మూత్రపిండాల్లో నీటి నిల్వ (హైడ్రో నెఫ్రోసిస్) అనారోగ్య సమస్య ఉన్నట్లు తేలిందన్నారు.

యూరియా కోత.. రైతుకు వాత

➤ కార్డులతో లబ్ధిచేకూరేనా..? ➤ కాంప్లెక్స్ కొంటేనే యూరియా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

ఎరువుల ఉత్పత్తి, పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు రైతులను మరింత అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. ఇప్పటికే కాంప్లెక్స్ ఎరువులకు రాయితీలు రద్దు చేసిన మోడీ ప్రభుత్వం..యూరియా సరఫరాలో కోర్రీలు పెట్టింది. కాంప్లెక్స్ ఎరువులపై సబ్సిడీ రద్దు చేసి కార్పొరేట్లకు మేలు చేకూర్చగా.. యూరియా సరఫరాలో రైతు కోటా తగ్గించి రాయితీ భారం నుంచి పారిపోవాలని చూస్తోంది. ప్రపంచ బ్యాంకును శాసిస్తున్న కార్పొరేట్లకు అనుకూలంగా ఎరువుల ఉత్పత్తి, పంపిణీకి మోడీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుండడంతో సరసమైన ధరలకు మాత్రమే ఎరువులను అమ్మాలని ఉత్పత్తిదారులకు కోర్టులు చేస్తున్న విజ్ఞప్తులు బుట్ట దాఖలవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచుకునేందుకు ఉత్పత్తి దారులకు సానుకూలత వ్యక్తం చేయగా..యూరియా వాడకం తగ్గించాలంటూ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం చేయడం గమనార్హం.



కార్డులతో రైతులకు లబ్ధిచేకూరేనా..?

కాంప్లెక్స్ ఎరువుల సరఫరాపై చేతులెత్తేసిన చంద్రబాబు ప్రభుత్వం, యూరియాపైనా సబ్సిడీ వ్యయాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలో ఎకరా వరికి కేవలం 3(50 కేజీలు)బస్తాలే రైతుకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అది కూడా మూడు దఫాలుగా పంపిణీ చేయాలని మార్గదర్శకాలిచ్చింది. యూరియా కావాలంటే వ్యవసాయ శాఖ జారీ చేసిన కార్డును తప్పనిసరి చేసింది. కార్డు పొందాలంటే ఈ–క్రాప్ నమోదు చేసి ఉండాలనీ, కౌలు రైతు అయితే యజమాని ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ నుంచి యూరియా పంపిణీ కార్డు పొందడం అంత సులభమేమీ కాదు. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లోని రైతులు ఇప్పటికే రబీ సాగులో తలమునకలై ఉన్నారు. ఇప్పటికి 10 శాతం మేర వరి నాట్లు పడిపోయాయి. వీరికి మొదటి దఫా యూరియా అవసరం ఉంది. అయితే ఇప్పటికీ యూరియా కార్డుల పంపిణీ పూర్తి కాకపోవడంతో రైతులకు రైతు సేవా కేంద్రాల్లో, సింగిల్ విండోల్లో, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా ఇవ్వడం లేదు. దీంతో రైతులు యూరియా కోసం ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 14న యూరియా కోసం ఎస్ఆర్ పురం మండలం వెళ్లి ఏర్పేడు మండలం మోదుగులపాలెంకు చెందిన శ్రీరాములు అనే దళిత రైతు అక్కడ విద్యుత్ షాక్ గురై మరణించిన దుర్ఘటన చోటు చేసుకుంది.

కాంప్లెక్స్ కొంటేనే యూరియా

జిల్లాలోని తూర్పు మండలాల్లో వరిలో యూరియా వాడకం అధికం. ఒక్కో ఎకరానికి 4 నుంచి 6 బస్తాల వరకు వాడటం అలవాటు చేసుకున్నారు. కాంప్లెక్స్ ఎరువుల కన్నా యూరియా ధర తగ్గులో ఉండటమే అందుకు కారణం. ఈ కారణంగానే ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా యూరియాకు డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది. కాకినాడలోని నాగార్జున ఫర్టిలైజర్స్ పరిశ్రమ మూతబడటమే కృత్రిమ యూరియా కొరతకు కారణమైంది. నాగార్జునకు కేంద్రం రూ.2500 కోట్లు బకాయి పడటంతో అతి పెద్ద యూరియా ఉత్పత్తిదారు పరిశ్రమ మూతపడింది. దీంతో కేంద్రం కార్పొరేట్ పరిశ్రమ అయిన గ్రీన్ కోకు కాకినాడలో అనుమతులు జారీ చేసింది. అయినా యూరియా తగినంత స్థాయిలో ఉత్పత్తి కాకపోవడం, దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ఆ లోటును పూడ్చుకునేందుకు ప్రభుత్వం యూరియా సరఫరాలో కోత పెట్టింది. దీంతో కంపెనీలు యూరియా కావాలంటే కాంప్లెక్స్ కొనాలంటూ డీలర్ల వద్ద బలవంతంగా డిమాండ్లు పెట్టిస్తున్నాయి. దీంతో రైతులు యూరియా దొరక్క ఆందోళన చెందుతున్నారు.

కార్డులతో సంబంధం లేకుండా
: పెనగడం గురవయ్య, ఏపీ రైతు సంఘం నాయకులు



జిల్లాలోని రైతులకు కార్డులతో సంబంధం లేకుండా యూరియాను పంపిణీ చేయాలి. యూరియా వాడకంపై రైతుల్లో అవగాహన పెంచాలి. యూరియాకు కాంప్లెక్స్ ఎరువులు కొనాలానే డీలర్లపై చర్యలు తీసుకోవాలి.

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దీపావళి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లాలోని ప్రజలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రతి ఇంటికి వెలుగు మాత్రమే కాదు, ఆశ, అభివృద్ధి, సంక్షేమం కూడా తీసుకురావాలని, రైతులు, యువత, మహిళలు, వృద్ధులు, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

సురక్షిత దీపావళి ప్రతి ఒక్కరి బాధ్యత :ఎస్పి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ "అనుమతులు పొందిన బాణాసంచా షాపుల నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు.అనుమతి లేని విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు బాణాసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తిరుపతి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్–112 నంబరును అత్యవసర సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయ ప్రాంగణలో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు



ఆలయ ప్రాంగణలో తెలంగాణ ఎంపీ ఈటెల రాజేంద్ర తదితరులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూర తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రత్యేక రాహు– కేతు పూజ చేసుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పగడాల రాజు, కంటా ఉదయ్ కుమార్, గున్నేరి కిషోర్ రెడ్డి, మున్నా రాయల్, మల్లెంబాకం మునికృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణా ఎంపీ ఈటెల రాజేంద్ర కూడా కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండరాళ్లు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా తిరుమల రెండో ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడ్డాయి. బండ రాళ్లు రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తిరుమలలో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా రెండో ఘాట్ రోడ్డులో తొమ్మిదో కిలోమీటర్ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ బండరాళ్ళ రోడ్డు మీద పడిపోవడంతో వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది కలిగింది. దీంతో, ఘటనా స్థలానికి చేరుకున్న టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు విరిగిపడిన కొండ చరియలను తొలగించారు. ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా జేసీబీలతో బండరాలను తొలగించారు

• గుప్త నిధుల కోసం తవ్వకాలు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కుక్కంభాకం గ్రామపంచాయతీలోని టానిగల్లు గ్రామ చివరలో ఉన్న వేమాలమ్మ గుడి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వేమాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసి, కింద భాగంలో గుప్త నిధులు ఉన్నాయనే అనుమానంతో ప్రతిరోజు రాత్రి సమయంలో రహస్యంగా తవ్వకాలు చేస్తునట్లుగా సమాచారం. శనివారం రాత్రి కూడా వేమాలమ్మ గుడి దగ్గర కింద భాగంలో గొయ్యి తీసి అక్కడ ఏమీ లేనట్లుగా గమనించిన దుండగులు వెళ్లిపోయినట్లు స్థానికుల తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి దుండగులు తవ్విన గొయ్యిని పరిశీలించారు. ఎవరైనా గుప్త నిధులు కోసం దేవాలయాలల్లో, పరిసర ప్రాంతాల్లో, పురాతన ఆలయాల్లో తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

• మోటరు చోరీలు అరికట్టండి : సిపిఎం



సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెలుగు రమేష్

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, మదనంబేడులో దాదాపు 15 రోజుల నుండి నిత్యం రైతుల వ్యవసాయ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేస్తున్నారు. చోరీలు జరుగుతున్నప్పటికీ దొంగలను పట్టుకొనే పరిస్థితి కనబడలేదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెలుగు రమేష్ దగ్గర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసువారు రైతు వ్యవసాయ మోటరులుపైనిఘా ఉంచి, మోటరు దొంగను పట్టుకోవాలని కోరారు. మదనంబేడు రైతులు ఈ నెల రోజుల్లోనే వర్షాలు కురుస్తున్న సందర్భంలో వరి సాగు చేయుటకు పొలాలను అన్ని రకాలుగా సిద్ధం చేసినప్పటికీ, నాటిన నాటుకు నీరు ఇవ్వలేక నారు పేరికి నాటడానికి నీరు లేక ఇలా మోటర్లు దొంగతనానికి గురై ఆవేదనలో రైతులు ఫిర్యాదు ఇచ్చినెల రోజులు జరుగుతున్నా దొంగతనాలు మీద ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం చాలా అన్యాయమఅన్నారు. దొంగతనానికి గురై ఆవేదన చెందుతున్న రైతులు వెంకటేశన్, రాజేంద్రన్, పాండి, కాళ్లెప్ప, తిరుమలకు చెందిన 20 మోటార్లు చోరీకి గురయ్యాయని, ఇప్పటికైనా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు.

• సంక్షేమ బోర్డును కొనసాగించాలి



సి.ఐ.టి.యు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-కోట: భవన నిర్మాణ కార్మికుల సంఘం సంక్షేమ బోర్డును కొనసాగించాలని, సి.ఐ.టి.యు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కోటలో ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ లేబర్ కార్యాలయం నుండి రావలసిన రాయితీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యత్వాల పెంపు గురించి చర్చించారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ విశాఖపట్నంలో 2025 డిసెంబర్ 31,- 2026 జనవరి 4 వరకు జరగనున్న సి.ఐ.టి.యు 18వ అఖిలభారత మహాసభలను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోట భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈ.నాగరాజు, కె. పోలయ్య, గూడూరు డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్.డి.రఫీ, సీనియర్ నాయకులు గండికోట మధు తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిని ప్రకటించాలి : సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు 12వ పి.ఆర్.సి ని వెంటనే అమలు చేయాలని, తిరుపతి జిల్లా సి.ఐ.టి.యు ఉపాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా, గూడూరుల సి.ఐ.టి.యు కార్యాలయంలో ఆదివారం ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సి.ఐ.టి.యు అనుబంధం ఆధ్వర్యంలో గూడూరు పట్టణ కమిటీ మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పి.ఆర్.సిని వెంటనే ప్రకటించి, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నవంబర్ 15,16 తేదీల్లో జరుగుతున్నాయని,



మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సి.ఐ.టి.యు తిరుపతి జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య, మున్సిపల్ యూనియన్ గూడూరు పట్టణ గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ దీపావళి పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సోమవారం మాత్రం దీపావళి సందర్భంగా రద్దు చేస్తున్నామని, వచ్చే సోమవారం యాదావిధిగా ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తామని తెలిపారు.

దళితులపై దాడి హేయం : కెవిపిఎస్



కెవిపిఎస్ గూడూరు మండల మొదటి మహాసభలో ఏంబేటి చంద్రయ్య తదితరులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా గూడూరు సి.పి.ఎం కార్యాలయంలో ఆదివారం కెవిపిఎస్ గూడూరు మండల మొదటి మహాసభ ఏంబేటి చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా దళితుల సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. సంక్షేమ పథకాలు దళితులకు సక్రమంగా అందడంలేదని విమర్శించారు. అనంతరం నూతన కమి టిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అడపాల ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బి.నారాయణ, కార్యదర్శిగా ఏంబేటి చంద్రయ్య, సహాయ కార్యదర్శిగా రాగిపాటి నారాయణ, ట్రెజరర్‌గా ఏకుల వెంకటరమణయ్యలను ఎన్నుకున్నారు.

పూర్ణాహుతితో ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి.



వాన తక్కువ.. బురద ఎక్కువ

- కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ చిందరవందర
- ఇబ్బందుల్లో ప్రజలు.. పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని జువ్వలపాలెం రోడ్డు బురదమయంగా తయారయింది. దీనితో ఈ మార్గం వెంట వెళ్లే ప్రజలు ద్విచక్ర వాహన సాధకులు నరకయాతన అనుభవిస్తున్నారు. చిరుజల్లుకి ఈ రోడ్డు చిద్రమై బురదమయంగా అడుగులోతు గుంతలు ఏర్పడుతున్నాయి. అడుగు తీసి అడుగు పెట్టలేనంత బురదగా ఉండడంతో ఈ మార్గం వెంట వెళ్లే వారి బాధలు వర్ణనాతీతం. గుంతలు ఏర్పడి బురదమయంగా ఉన్న ఈ రోడ్డుపై ద్విచక్ర వాహన సాధకులు జారిపడి ప్రమాదాలు



జరిగిన సంఘటన అనేకం ఉన్నాయి. అవసరమైన చోట్ల సిమెంట్ రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామన్న అధికారులకు అనేక పర్యాయాలు తమ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్నులు, కొళాయి పనులు ముక్కు పిండి వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు తమ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు డ్రైనేజీ కాలంలో నిర్మించుకోవడంలో ఆంతర్యం ఏమిటని ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి వివిధ పార్టీల నాయకులు జువ్వలపాలెంలో ఉన్నప్పటికీ తమ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు డ్రైనేజీ కాలువలో నిర్మించుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి జువ్వలపాలెం దళితవాడ నుండి ప్రాథమిక పాఠశాల వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును సిమెంట్ రోడ్డు గా ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

లక్ష్య సాధనతోనే విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్తు

చదలవాడ రమణమ్మ ట్రస్టీ మెంబర్ వరుణ్ సాయి



ఫ్రెషర్స్ డే వేడుకలలో మాట్లాడుతున్న చదలవాడ రమణమ్మ ట్రస్టీ మెంబర్ వరుణ్ సాయి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవాలంటే నిరంతర సాధన ఎంతో అవసరమని చదలవాడ రమణమ్మ కళాశాల ట్రస్టీ మెంబర్ వరుణ్ సాయి పేర్కొన్నారు. తిరుపతి–రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జెనెసిస్ 2కె25 పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కళాశాల ట్రస్టీ మెంబర్స్ చదలవాడ కవిత, సాహితి, వరుణ్ సాయి, రంగనాథం, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ పటేల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టీ మెంబర్ వరుణ్ సాయి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, ప్రణాళికాబద్ధంగా చదవి లక్ష్య సాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. మారుతున్న అధునాతన కోర్సులు, టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయని, ఎంపిక చేసుకున్న కోర్సు ద్వారా మంచి నైపుణ్యాన్ని విద్యార్థులు సాధించి వారి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. నేడున్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే పరిశోధన విద్య ఎంతో ప్రామాణికమైనాదన్నారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధన అందిస్తున్నామని, కళాశాలలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన వాటిని వినియోగించుకుని లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలన్నారు. ప్రతి విద్యార్థి టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్ పై దృష్టి సారించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తును సుస్థిరం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంజీవ రాయుడు, అధ్యాపకులు, జూనియర్, సీనియర్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు దీపావళి కానుక



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దీపావళి పండుగ సందర్భంగా మంగళం పరిధిలోని మంగళం గ్రామపంచాయతీ, సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలలో పనిచేసే పంచాయతీ కార్మికులకు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో వస్త్ర దినుసులు, నూనె, బియ్యం, టపాకాయలు టిడిపి నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్ నాయుడు, వార్డు సభ్యులు గంగ, చలపతి, శశి, లక్ష్మీ, చంద్రగిరి నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు సుబ్బయాదవ్, గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అల్లాభాషా, హరికృష్ణ, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు విస్తృతం



ప్రజాశక్తి - కోట : శ్రీ ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి. కిషోర్ తన స్వంత నిధులతో నిర్వహిస్తున్న పసుపులేటి. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. ఇటీవల ప్రగతి హాస్పిటల్లో కాన్పు చేయించుకొని మగబిడ్డను ప్రసవించిన ఇద్దరు నిరుపేద మహిళలకు పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నల్లపరెడ్డి. జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఒక్కొక్కరికి పది వేల రూపాయల చొప్పున మొత్తం ఇరవై వేల రూపాయల మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. గతంలో కూడా కోటలోని స్వర్ణధామంలో గ్యారేజ్ నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఈ రోజు ఒక ఎస్టీ సామాజిక వర్గం, ఒక మైనారిటీ వర్గానికి చెందిన ఇద్దరు నిరుపేద మహిళలకు వైద్య ఖర్చులకు ఇరవై వేల రూపాయల ఆర్థిక సాయం చేసిన పసుపులేటి కిషోర్ ను అభినందించారు. అతి తక్కువ ఖర్చుతో కార్పోరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ప్రగతి హాస్పిటల్ డాక్టర్ దివ్య ప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షులు అల్లం రమణయ్య, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


భక్తులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి కూత వేటులో ఉన్న తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధిలో భక్తులపై విజిలెన్స్, పోలీసుల దాడులు విపరీతమైపోయాయని హిందూ జర్నలిస్టు ఫోరం సభ్యుడు మునిరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుచానూరు శివ ఎర్రావారిపల్లెపై సాధారణ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారని, దీనిపై ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఆర్డిఓ ఆర్డర్ వెనుక్కు తీసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కుల మతాలకతీతంగా జరుపుకునే పండుగ దీపావళికి టపాకాయల విక్రయాలపై తిరుపతి ఆర్డిఓ ఇచ్చిన ఆర్డర్ను వెంటనే వెనక్కి తీసుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి నాయకులు కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో కొందరు అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, పండుగ రోజున టపాకాయల విక్రయం చేయడానికి వీలు లేకుండా ఆర్డిఓ తిరుపతి వారు ఆర్డర్ ఇచ్చారన్నారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే పండుగకు ఆటంకాలు కలిగించడానికి ఉద్దేశ పూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం



ప్రజాశక్తి - పాకాల: మొగరాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2014 - 2015 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ప్రధానోపాధ్యాయులు సుమలత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చెంగల్రాయ నాయుడు, సుమలత, ఆంజనేయులు, బాబు, కిరణ్,చంద్రశేఖర్ నాయుడు, ఇందిర, వెంకటసిద్ధులు, జహంగీర్, మునస్వామి, శేఖర్లను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందారు.

ఎస్టీ కాలనీలో విద్యుత్ వెలుగులు




ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండల పరిధిలోని లక్ష్మమ్మ కండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన ఎస్టీ కాలనీలో సుమారు 35 కుటుంబాలు నివసిస్తున్నారు. గిరిజన ఎస్టీ కాలనీ ప్రధాన రహదారికి ఎన్నో ఏళ్లుగా విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహిళలు, వృద్ధులు రాత్రివేళ అసౌకర్యానికి గురయ్యేవారు. ఇటీవల స్థానిక ప్రజలు తమ సమస్యను నాయకులకు తెలుపగా, విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చొరవతో స్థానిక టిడిపి నాయకులు విద్యుత్ సదుపాయం కల్పించారు. ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

ఎస్ఐ హరిప్రసాద్కు సన్మానం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టిన హరిప్రసాదను ఆదివారం మండలం నెలవాయి ఎంపీటీసీ మనోహర్ నాయుడు, తలారిపల్లి ఎంపీటీసీ చలపతిలు ఘనంగా సన్మానించారు. మనోహర్ నాయుడు మాట్లాడుతూ హరిప్రసాద్ విధులపట్ల బాధ్యతగా వ్యవహరించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఐటిడిపి వీడియో కోఆర్డినేటర్ తండా రమేష్, మల్లికార్జున్ నాయుడు, ధనంజయ నాయుడు, సివిలిలేసి మధు నాయుడు, ఐ టిడిపి రమణయ్య యాదవ్, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల మాటే.. జగన్మోహన్ రెడ్డి బాట



ప్రజాశక్తి -కోట : వైసీపీ కార్యకర్తల మాటే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బాట అని ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్ స్పష్టం చేశారు. ఆదివారం కోట మండలంలోని అల్లంపాడు పంచాయతీలో వైఎస్ఆర్సిపి పార్టీ సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటుచేసిన మెడికల్ కాలేజీల ప్రైవేటికరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ మాట్లాడుతూ వైసిపి పార్టీ ప్రవేశపెట్టిన నవరత్నాలు రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. మంచి వ్యవస్థను ప్రస్తుతం చంద్రబాబు నాయుడు తుంగలో తొక్కేసారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్లు అబద్ధపు హామీలు ఇచ్చారని ఆరోపించారు. ఈ సమావేశంలో కోటి సంతకాలను సేకరించి గవర్నర్కు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేస్తారని తెలిపారు. వైసీపీ పార్టీ పరిశీలకులు వీరేంద్ర వర్మ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే ఆయా మెడికల్ కాలేజీలను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారన్నారు. వైసీపీ సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి మరలా జగన్మోహన్ రెడ్డిని సీఎంని చేసుకుంటే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గుర్తించాలని వైసీపీ యువ నాయకులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర మాట్లాడుతూ పి-ఫోర్ వ్యవస్థను తీసుకురావడంలో సాధారణ, మధ్య తరగతి వారికి ఎలాంటి ఉపయోగం లేదని కేవలం ధనవంతులకే ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎన్నికల పరిశీలకులు వీరేంద్ర వర్మ, మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, జడ్పిటిసి దాసరి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ధరలు తగ్గింపు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ భాగంగా తగ్గింపు రేట్లపై నెల రోజులు పాటు అనేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందనీ, ప్రతి ఒక్కరికి జీఎస్టీ తగ్గింపు ఫలాల గురించి ఇంకా విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం కచ్చపీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ముగింపు కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్లు నాగేంద్ర, శర్మ , పర్యాటకశాఖ ఆర్ డి రమణ ప్రసాద్లు పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గాయని అందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలని కమిషనర్ మైర్య సూచించారు. జిఎస్టి అడిషనల్ కమీషనర్లు మాట్లాడుతూ.. పన్ను రేట్లను తగ్గించి దాని ద్వారా పొదుపు సాధించి, ఆ పొదుపు ద్వారా ఇంకొక రకంగా పెట్టుబడి పెట్టి సంతృప్తికరమైన ఆర్థిక ప్రగతిని సాధించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.వి చౌదరి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు దీపావళి కానుక



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని కొండమిట్టకు చెందిన 40 మంది భవన నిర్మాణ రంగ కార్మికులకు సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో ఆదివారం దీపావళి కానుకలు అందజేశారు. పోలూరు రమణారెడ్డి, కందప్ప విజయ్ రెడ్డి సౌజన్యంతో దుస్తులు, స్వీట్స్ అందించారు. దీపావళి వెలుగులు కార్మికుల జీవితాల్లో సైతం విరిసిల్లాలని గురవయ్య ఆకాంక్షించారు.

ముందస్తు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, ఆర్.కె. గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం ఉత్సాహంగా ముందస్తు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు దీపాలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా ఆర్. కె ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఆర్.కె. రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానం అనే దీపాన్ని వెలిగించి, తమ భవిష్యత్తును ప్రకాశవంతం చేసుకోవాలని తెలిపారు. ఆర్. కె ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ ఆర్.కె. విమల మాట్లాడుతూ క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని తిరుపతిలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఉన్న ధన్వంతరి విగ్రహం వద్ద తిరుపతి, యూనివర్సిటీ హెల్త్ సెంటర్, వారిచే పూజా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఎన్ఎస్యు ఉప కులపతి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, ప్రొ. వి.వనజాక్షమ్మలు మాట్లాడుతూ ధన్వంతరి ఆశీస్సులు విశ్వవిద్యాలయం, విద్యార్థులు, సిబ్బందిపై ఉండాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి సంబంధించిన పోస్టర్లను యూనివర్సిటీ హెల్త్ సెంటర్ తయారు చేసిన వాటిని ఉప కులపతి అతిథులు విడుదల చేశారు.

టపాసులు పేల్చేటప్పుడు నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: దీపావళి పండుగను ఆనందంగా, ప్రమాదరహితంగా జరుపుకోవాలని తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ , ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టపాసులు పేల్చేటప్పుడు నిర్లక్ష్యం ప్రాణాంతకమవుతుందని హెచ్చరించారు. మండల ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్వీజేసిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వము, టిటిడి ఆదేశాల మేరకు శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రతి నెల మూడవ శనివారం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర %-% స్వచ్ఛఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి కొరకు ప్రజా రవాణా వాహనాల వినియోగం, మొక్కలు నాటుట, సోలార్ విద్యుత్ వినియోగం పైన కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వారిచేత ప్రతిజ్ఞ చేయించి, సైకిల్ ర్యాలీని నిర్వహించారు. తదనంతరం కళాశాల ప్రాంగణములో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పి. ప్రియవర్ధనబాబు, కె. కృష్ణ కిషోర్, సి. శ్రీనివాసులు నాయుడు, డా. సి. ఎల్. చెన్నా రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి ప్రమిదలు పంపిణీ



ప్రజాశక్తి-కోట: కోట మండలం, గాంధీ బొమ్మ వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దీపావళి పండుగ సందర్భంగా పట్టణ ప్రజలకు మట్టి ప్రమిదలునుపంపిణి చేశారు. సోమవారం దీపావళి పండుగ నేపథ్యంలో ముందుస్తుగా ప్రజలకు మట్టి ప్రమిదలును అందజేశారు. మట్టి ప్రమిదలు వెలిగించడం వెనుక ఆరోగ్య రహస్యాలు మరెన్నో ఉన్నాయని రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. అదేవిధంగా మట్టి ప్రమిదల్లో దీపాలును వెలిగించడం ద్వారా వచ్చే దీపపు కాంతి కంటికి ఎంతో మేలు చేస్తుందన్నారు. కోట పట్టణ ప్రజలకే కాకుండా పనులు నిమిత్తం పలు గ్రామాలు నుండి కోటకు వచ్చిన వారు కూడా ప్రమిదలు తీసుకునే అవకాశం పొందారు. ఈ కార్యక్రమంలోతిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డి,ప్రగతి విద్యా సంస్థల కరెస్పాండంట్ పసుపులేటి కిషోర్, కొకర్ల.మధు యాదవ్,ఎంపిటిసి దారా సురేష్,తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డిఏ మంజూరు అభినందనీయం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉద్యోగులకు డిఏ మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఏపీ ఎన్ జిజీవో అసోసియేషన్ తిరుపతి జిల్లా చైర్మన్ సురేష్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీవో హోమ్ వద్ద సీఎంకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని అదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు రావలసిన, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన కాంట్రిబ్యూషన్, ఉద్యోగ విరమణకు సంబంధించిన బకాయిలు, సుమారు 15 వేల కోట్ల వరకు చెల్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, తిరుపతి తాలూకా కోశాధికారి శ్రీనివాసులు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ స్టాఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు ఉద్యోగులు పాల్గొన్నారు.

భూ రికార్డులు మార్చేశారు



ప్రజాశక్తి -తిరుపతి (మంగళం): మా ప్రమేయం లేకుండా తాము కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన రికార్డులను ఆన్ లైన్ లో బిఎన్ కండ్రిగ మండల తాహశీల్దార్ శ్రీదేవి మార్పు చేశారని, దీనిపై ప్రశ్నిస్తే కేసులు పెట్టారని బాధితులు అనసూయమ్మ, పాండురంగ వాపోయారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బి.ఎన్ కండ్రిగ మండల పరిధిలోని పల్లమాల గ్రామం లెక్కల సర్వేనెంబర్ 79/3లో 91 ఖాతాలోని 5 ఎకరాల డికెటి భూమిని బూదూరు గోవిందమ్మ నుండి 2011లో కొనుగోలు చేశామన్నారు. అప్పటినుండి మా స్వాధీనం అనుభవంలో ఉన్న భూమిని కాచేయాలని పోగూరు సుధాకర్, రెడ్డిపల్లి శేఖర్, రెడ్డిపల్లి చెంగయ్య, బీమల చెంగయ్య, భీమల హరి అనే వ్యక్తులు ఇబ్బంది పెడుతుంటే 2025 సెప్టెంబర్ లో కోర్టును ఆశ్రయించమన్నారు. కోర్టులో వ్యాజ్యం నడుస్తుండగానే మా పొలానికి సంబంధించిన రికార్డులను అక్టోబర్ 8వ తేదీ వరకు అనసూయమ్మ పేరుపై ఉన్న భూమిని, రెడ్డిపల్లి శేఖర్ ఎమ్మార్వోకు దాదాపు పది లక్షల రూపాయలకు పైగా నగదు ఇచ్చి రవీంద్రబాబు అనే వ్యక్తిపై భూ రికార్డు మార్పిడి చేశారన్నారు. దీనిపై కార్యాలయానికి వెళ్లి అడగగా బెదిరింపులకు దిగారని, అసహనంతో డీజిల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేశానన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమ భూమి రికార్డులను తమ పేరుపై మార్పిడి చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మంజుల, మౌనిక పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వి.ఎస్. ఆర్ స్కూల్ కరస్పాండెంట్ నందిమండలం బాలకృష్ణం రాజు దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు బాలా, సుధీర్ ద్వారా ఆదివారం పంపిణీ చేశారు. బాలకృష్ణంరాజు మాట్లాడుతూ సమాజం కోసం కష్టపడుతున్న జే.వి.వితో కలిసి పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురళీ మృతి బాధాకరం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త కుడిచేటి మురళి మృతి బాధాకరమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని వాపోయారు. ఆదివారం మురళీ మృతదేహానికి నివాళి అర్పించారు. మురళి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీతారాం, సురేంద్ర రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ సంస్థ దీపావళి కానుక



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రెడ్ ఫెస్టివ్ రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసబుల్డ్(రెడ్) సంస్థ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా ఆదివారం 40 పేద దివ్యాంగులకు కొత్త బట్టలు, స్వీట్స్, టపాసులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ గౌరవ అధ్యక్షుడు మునపాటి రవీంద్ర బాబు విచ్చేసి, దివ్యాంగులకు కానుకలు అందజేశారు. నితీష్, సతీష్ల దాతృత్వంలో స్వీట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జానా సుధీర్, ప్రోహిద్ రాజేష్, రామలింగం, శ్రీధర్, శ్రీనివాస ఆచారి, పల్లం వెంకటేశ్వర్లు, జమీర్ పాల్గొనారు.

బాణాసంచా దుకాణాల పరిశీలన



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వారాంతపు సంత వద్ద ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను ఆదివారం సాయంత్రం బుచ్చినాయుడు కండ్రిగ తాసిల్దార్ శ్రీదేవి, సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్లు పరిశీలించారు. తహశీల్దారు మాట్లాడుతూ దుకాణాల దగ్గర ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘట నలు తలెత్తితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఆయుధపూజ

ప్రజాశక్తి - చంద్రగిరి: పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లిలో ఆదివారం ఘనంగా ఆయుధ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు, పులివర్తి వినీల్ హాజరయ్యారు. వినీల్కు, బడి సుధా యాదవ్కు గ్రామస్తులు, మహిళలు హారతులు పట్టి తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయుధ పూజాలో పాల్గొని వాహనాన్ని పులివర్తి వినీల్ నడిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రైల్వే పోలీస్టేషన్ పరిధిలో తిరుపతి రైల్వేస్టేషన్, రేణిగుంట రైల్వేస్టేషన్ల మధ్యన రిలయన్స్ అండర్ బ్రిడ్జ్ సమీపంలో డౌన్ లైన్ రైల్వే ట్రాక్ రైల్వేపట్టాల పై ఒక గుర్తు తెలియని మగ మనిషి వయసు సుమారు 50 ఆత్మహత్య చేసుకుని పడిఉన్నాడని తిరుపతి రైల్వే స్టేషన్ మాస్టర్ వారిచ్చిన పిర్యాదు మేరకు రైల్వే పోలీస్ హెడ్ కాన్స్టేబుల్ చంద్ర శేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఎస్వి మెడికల్ కాలేజీ మార్చురికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. సదరు వ్యక్తి వివరాలు తెలిసిన వారు సెల్ నెంబర్ 9440627638, 9440352765కు సమాచారం అందించాలని కోరారు.

అంజేరమ్మ కనుమ వద్ద రోడ్డు ప్రమాదం






ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, అంజేరమ్మ కనుమ వద్ద ఆదివారం ఉదయం 5.30 గంటలకు గ్యాస్ లారీని, ఐచర్ లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. కూరగాయల లోడ్తో వెళుతున్న ఇచర్ లారీ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్కు కాళ్లు చేతులు విరిగాయి. ఐచర్ లారీ డ్రైవర్ స్వల్ప గాయలతో బయట పడ్డాడు. సమాచారం అందుకున్న వడమాల పేట పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయపడిన డ్రైవర్ను స్థానిక టోల్ ప్లాజా అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి.తరలించారు.

రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు ఆదివారం ఎంపీ గురుమూర్తిను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీ వద్ద రైల్వే గేటు మరమ్మత్తుల పనులతో రైల్వే అధికారులు స్థానిక దళిత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్కు వివరించారు. తమ ప్రాంతంలో రైల్వే గేటు మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలియజేశారు. తమ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించి వెంటనే డివిజనల్ రైల్వే మేనేజర్కి ఫోన్ చేసి ఈ సమస్యని త్వరగా పరిష్కరించాలని తెలియజేశారు. అదేవిధంగా త్వరలో రైల్వే శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తడుకు చందు, గోవిందు శ్రీనివాస్, జడ వెంకటేష్, కప్పల మునుస్వామి, పచ్చికాయల వెంకటేష్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంజేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దీపావళి సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వడమాల పేట సమీపంలో కొలువై ఉన్న అంజేరమ్మ తల్లిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు అందించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి రోజున అమ్మవారిని దర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.